# జాగృతి

రెంటాల నాగేశ్వరరావు

రవి చెప్పిన సమాధానం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. మా ఆవిడైతే ఏదో మాట్లాడుదామని తెరచిన నోరు అలానే వుంచేసింది.

అందమైనది, ఈ ఊళ్ళోనే నెలకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నదీ, తెలివైనదీ చురుకైనదీ అయిన రమని ఇచ్చి పెళ్ళిచేస్తామంటే 'కట్నం' కావాలన్న రవి సమాధానాన్ని ఏరకంగా తీసుకోవాలో నాకు అర్థం కాలేదు. వెంటనే మాట్లాడటానికి మాటలు దొరకక మౌనంగా భోజనం చేయసాగాము. ఈ మాట మరెవరైనా అంటే ఆశ్చర్యపోను కాని, రవి అలా మాట్లాడటం చాలా షాకింగ్‌గా వుంది నాకు.

రవి నేను కలిసే చదువుకున్నాం. చదివే రోజుల్లోనే ఏవో సిద్ధాంతాలు అవీ ఇవీ అని తిరుగుతుండేవాడు. అతడి ఆశయాలు స్థిరమైనవే. ప్రతి సమస్యనీ వ్యక్తిపరంగా కాక సమాజపరంగా చూస్తుండేవాడు. అలానే మాట్లాడేవాడు. డిగ్రీ అయిపోయాక నేను వ్యవసాయంలో పడిపోయి పల్లెటూళ్ళోనే ఉంటున్నాను. అప్పుడు దూరమయిన మా స్నేహం, తిరిగి రవి గ్రామీణబ్యాంక్‌లో క్లర్క్‌గా మా వూరే రావటంతో మరింత దగ్గరయింది. రవి బ్రహ్మచారి కావటంతో మా ఇంట్లోనే వుంటున్నాడు. మేం మళ్ళీ కలిసేసరికి రవిలో వచ్చిన ఒకే ఒక మార్పు — అతడు రచయిత కావటం. కేవలం కొందరు మనుషుల మధ్య జరిగే సంఘటనలు కథలుగా వ్రాయటం గాక, సమాజపరంగా వుండేవి అతడి కథలన్నీ. అతడి సిద్ధాంతాలన్నీ అతడి రచనలలో కూడా ద్యోతకమవుతుంటాయి. వరకట్న పిశాచాన్ని ఆధారంగా కొన్ని కథలు కూడా వ్రాశాడు.

అలాంటి రవి కట్నం కావాలనటం నాకు ఆశ్చర్యంగా వుంది.

"అయితే ఎంత కట్నం కావాలంటావ్?" అతనికేసి చూడకుండానే అన్నాను.

రవి కూడా నాకేసి చూడలేదు. మౌనంగా భోజనంచేస్తూనే, కాసేపాగి అన్నాడు.

"ఆ అమ్మాయి అక్కయ్యకెంత కట్నం ఇచ్చారు?"

"ఇరవై వేలనుకుంటాను." ఆలోచిస్తూ అన్నానేను.

"అయితే పదివేలిమ్మను."

నేను మాట్లాడలేదు.

"ఆ అమ్మాయికి ఉద్యోగంలేదు. అందుకనే కట్నం ఇచ్చారు. ఈ అమ్మాయికేం- మంచి ఉద్యోగం చేస్తోంది. బహుశా నీకంటే ఎక్కువే సంపాదిస్తోంది. అలాటప్పుడు కట్నం అడగటం ఏం ధర్మం?" ఆశ్చర్యాన్నుండి తేరుకుని రవికి నెయ్యి వడ్డిస్తూ అంది జానకి. ఆ మాటల్లో కొంచెం నిష్ఠూరత కూడా ధ్వనిస్తోంది. కనుబొమ్మలు పైకెత్తి జానకికేసి చూశాడు రవి.

"అయినా జనానికి ఏదో చెప్పటమే అలవాటుగావున్న మీలాటి రచయితలకు, రాజకీయనాయకులకు చెప్పేది చేసే అలవాటు ఎక్కడుంది? హరిదాసు ఉల్లిపాయ కథలా తప్పితే-"

చిన్నగా నవ్వాడు రవి.

"అవున్రా రవీ! ఆవిడకి సమాధానం చెప్పక నవ్వేస్తావేం? కట్నాలు వద్దనే రచయితలలో కట్నం తీసుకోకుండా పెళ్ళిచేసుకుం టెంతమందో చెప్పు...? నాస్తికవాదులమని ఉపన్యాసాలిచ్చే ఎంతమంది భార్యలు రోజూ పూజచేయరు? కమ్యూనిజం వల్లెవేసే ఎందరు పెటీ బూర్జువాలకు ఆస్తులు లేవు?" సూటిగానే అడిగాను నేను.

చిన్నగా నవ్వాడు రవి.

"నీవు సమస్యను సమస్యగా తీసుకుంటే వాటివెనుక ఉండే రహస్యం విశదమవుతుంది. స్థూలంగా ఆలోచించే పైవారికి వారి మాటలకు చేతలకు వ్యతిరేకత కనిపిస్తుంది. కాని లోతుగా నిజం ఆలోచిస్తే వారి చర్యలలో వ్యతిరేకత కనిపించదు-"

వివరణ లేని వాడి స్టేట్ మెంట్ కర్థంకావడంలేదు. అదే అన్నాను వాడితో.

"నీ కర్థంకాదులే-" చేయి కడుగుతూ అన్నాడు రవి. "అర్థంచేసుకోవాలని ప్రయత్నిస్తే ఏదయినా అర్థమవుతుంది. మిగతావాటి గురించి తరువాత ఆలోచిద్దాంగాని, ప్రస్తుత విషయమే ఆలోచించు... అదే నీవు చెప్పిన అమ్మాయి-రమకు ఉద్యోగం లేదనుకో అప్పుడు నీకే ఈ సంబంధం తెస్తే ఇంత కట్నమివ్వగలరు అని నీవే ప్రారంభించి వుండేవాడివి... కదూ?"

నాప్కిన్ తో పెదవులు తుడుచుకుంటూ అన్నాడు రవి.

"అవును.... ఆ అమ్మాయికి ఉద్యోగం లేకముందు పదిహేనువేలు కట్నం ఇస్తాము, సంబంధం చూడండి' అని రమ తండ్రే స్వయంగా నాతో చెప్పాడు... "

"మరిప్పుడు ఉద్యోగం వచ్చింది గనుక కట్నం ఇవ్వనంటున్నాడు అంతే కదా?" చిన్నగా నవ్వేడు రవి.

"అది సహజమే కదా! ఆ అమ్మాయి నెలకు వెయ్యిరూపాయలు సంపాదిస్తోంది ....సంవత్సరానికి పన్నెండువేలు. అదే క్రమంలో ఇరవై వేలు .... ఇలా ఏ కాంతం ఎన్నో లక్షలు వస్తాయి కదా?

ఇంకా కట్నం ఎందుకివ్వాలి....? కంచాలు వర్డుతూ అంది జానకి.

"అవును..." గట్టిగానే అన్నాన్నేను. కేవలం పదివేల కట్నానికి ఆశపడి వచ్చే లక్షలాది రూపాయలను వదులుకోవటం తెలివితక్కువతనం...."

వక్కపలుకు వేసుకుంటూ ముందు గదిలో సోఫాలో కూర్చున్నాడు రవి.

"ఏం జానకీ! నువు కూడా వన్నో మూర్ఖుడనే అనుకుంటున్నావు గదూ?" గిన్నెలు వర్డుతున్న జానకిని ఉద్దేశించి అన్నాడు రవి. జానకి మాట్లాడలేదు.

"ఆమె మౌనం అంగీకారమే. ఆమే కాదు.... నేనూ అనుకుంటున్నాను నీది మూర్ఖత్వమని.... మిత్రుడిగా నా సలహా ఏమిటంటే - నోరుమూసుకుని దానిని చేసుకో.... బాగుపడతావు." కొంచెం మందలింపుగానే అన్నాను.

చిన్నగా నవ్వాడు రవి.

"నా సిద్ధాంతాలు, ఆశయాలు మర్చిపోతున్నారు మీరు...." విచిత్రంగా అన్నాడు రవి.

"నీ బొంద సిద్ధాంతం.... ఆ కబుర్లు నాకు చెప్పకు.... కట్నంలేకుండా పెళ్ళి చేసుకోవనే నీకూ ఆశయాలున్నాయా? రచయిత కావటానికి నీకు అర్హతవుందా?" కోపంగా అన్నాను.

"ఆవేశపడమాకురా!" చిన్నగా నెమ్మదిగా అన్నాడు రవి. "నా ఆశయాలను నేను వదులుకోనని తెలుసు నీకు. కేవలం పదివేల కాశపడి వచ్చే లక్షలాది రూపాయలు వదులుకునేంత మూర్ఖుడిని కాదు..."

"అయితే ఈ పెళ్ళికి నవ్వుకుంటున్నావా?" ఆశగా అడిగాను నేను. అవును మరి. పదివేలకోసం లక్షలాది రూపాయలు వదులుకునేంతటి మూర్ఖుడ్ని కాదు రవి.

"కట్నం ఇస్తే—"

"మళ్ళీ అదేమాట! ఎంత ఆశరా నీకు... ఆ లక్షలూ కావాలి, ఈ పదివేలూ కావాలి...ఇది పట్టపగలు దోపిడీ కదూ?"

మళ్ళీ నవ్వాడు రవి. ఛత్- నవ్వకు మరి... నువ్వింత ఆశపోతువని నేను కలలోకూడా అనుకోలేదురా-" కోపంగా అన్నాను నేను. అయినా నవ్వాడు రవి. పెద్దగానే నవ్వాడు.

"అందుకే నీకు చాలా విషయాలు తెలియవు వాటిజోలికి పోవద్దని చెప్పేది. కట్నం ఇవ్వందే నే చేసుకోను. కట్నమివ్వటానికి ఆ పిల్లతండ్రి వప్పుకోడు. కనుక ఈ పెళ్ళి జరుగదు. అంటే నాకు రాగల లక్షలాది రూపాయలు వదులుకుంటున్నాను. బోధపడిందా ... నాకు డబ్బుమీద ఆశవుంటే—ఈ సంబంధాన్ని అంగీకరించివుందును. నీవు లెక్కవేస్తే లక్షలాదిరూపాయలూ నాకుచెందివుండేవి. అవునా?"

తలూపాను.

"లక్షలరూపాయలు వదులుకునేవానికి డబ్బుమీద ఆశ వుందని అనటం పొర పాటు కదూ?" గంభీరంగా అన్నాడు రవి.

నాకు అర్థంకాకపోయినా తలూపాను.

"నా ఆశయాల పోతిలేస్తే ఈ పెళ్ళికి అంగీకరించి వుండేవాడిని. నిజంగా పట్ట పగలు దోపిడిచేసినవాడి నయ్యేవాడిని."

"అయితే కట్నం తీసుకొని చేసు కుంటే అది దోపిడీ కాదా?"

"కాదు." స్థిరంగా అన్నాడు రవి.

నా కర్థంకాలేదు. రవి చెప్పేదాంట్లో ఆ దోపిడీ ఏమిటో నా కర్థంకాలేదు గాని రవి మాత్రం డబ్బుకి ఆశపడటంలేదనేది అర్థమయింది.

'ఆ దోపిడీ ఏమిటా?' అని ఆలోచిస్తు న్నాను.

గోడగడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

వంటింటి తలుపులు వేసివచ్చింది జానకి.

"ఈ వరకట్నాలవల్ల ఎన్ని కుటుం బాలు నాశనమవుతున్నాయో నీవు గమ నించటంలేదా రవీ? అత్తమామల పోరుకి ఆత్మత్యాగం చేస్తున్న ఎందరో స్త్రీల సమస్యలను గురించి నీవు వినలేదా? ఇంకా కట్నం కావాలని కోరటం తిరో గమనమే అవుతుంది." గదపలో కూర్చుంటూ అంది జానకి.

"నిజమే." మెల్లిగా అన్నాడు రవి.

"స్త్రీ తనను తనగా గౌరవించేవాడినే వివాహమాడాలనుకుంటుంది. తన వ్యక్తి త్వానికి విలువ ఇచ్చే పురుషుడికోసే కాలం గడపాలనుకుంటుంది. కట్నం ఇవ్వదలటం తన ఆత్మాభిమానాన్ని పణంగా పెట్టటమే అవుతుంది. రమ ఎంత ఆత్మాభిమానంగల పిల్లో నాకు తెలుసు. నీవు కట్నం అడిగావని తెలిస్తే అసలు ఆమె ఈ సంబంధాన్ని కొప్పుకోక పోవచ్చు.... నీకు కట్నంకోసం ఎందు కంత ఆశ.... నీవు సంపాదించటంలేదా? నీ భార్యను నువు పోషించుకోలేవా? మామగారిచ్చే కట్నమే కావాలా?" నచ్చ చెబుతున్న ధోరణిలో అంది జానకి.


దీర్ఘంగా ఆలోచించాడు రవి.

"జానకీ.... మీ రిద్దరూ నన్ను అపార్థంచేసుకుంటున్నారు.... నేను ఆశ యాలకు కట్టుబడిలేనని అనుకుంటు న్నారు. మీ దృష్టిలో నా గౌరవం పడి పోయిందని అనుకొని దానిని పోగొ ట్టటంకోసం విపులీకరించ దలుచు కున్నాను. ఒక్క మాటడుగుతాను సూటిగా జవాబు చెప్పగలవా?"

ఆగి నాకేసి చూశాడు రవి.

చెప్పు అన్నట్లు తలూపాను.

"ఒక వేశ్యకి డబ్బు చెల్లించి తన కామం తీర్చుకుంటాడు మగవాడు. అది నీచమైనా అక్కడ స్త్రీకి ఇంత 'విలువ' అని వుంది. అదే పెళ్ళిచేసుకుని అదే




సుఖాన్ని గాక, మరెన్నో సుఖాలనో పొందటానికి తనే 'వెల' ఇమ్మంటున్నాడు.... ఎందుకో ఎప్పుడయినా ఆలోచించారా?"

తెలీవన్నట్లు తలూపింది జానకి.

"బహుశా జనాభాలో మగవాళ్ళ సంఖ్య తక్కువేమో?" ఆలోచించి అన్నాను.

"కాదు. స్త్రీ పురుషుల నిష్పత్తి సమానంగానే వుంది"

"మరెందుకని?" సాలోచితంగానే ప్రశ్నించాను.

"వస్తు అపార్థం చేసుకోకుండా వుండాలంటే దానిని మీ రర్థం చేసుకోగలగాలి." సిగరెట్ వెలిగించి తాపీగా అన్నాడు రవి.

"పరిమాణ క్రమంలో మాతృసామ్యం నుండి, పురుషసామ్యం రావటం జరిగింది. అపుడే ఓలినుండి కట్నం రావడం తటస్థించింది. పురుషసామ్యంలో స్త్రీ కూడా ఒక రకమైన ధనరూపంగా మారింది డబ్బులాగానే స్త్రీని ఇంట్లో దాచివుంచుతున్నాడు మగాడు. పరదాలలో కప్పుతున్నాడు. డబ్బులాగానే స్త్రీ కూడా దొంగతనంగానో, బలవంతంగానో, అమనయంగానో దోచుకోబడుతున్నది. అయితే ఆ దోపిడీని స్త్రీలు గుర్తించగలిగే స్థితిలో ఈనాడు లేరు. అందుకే ఈ కట్నాలబెడద పోదు. ఆర్థికపరమైన మార్పులు సంభవిస్తే తప్ప ఈ దురాచారం ఆగదు. సతీసహగమనం చట్టరీత్యా నేరం అవగానే తొలగిపోదు. పురుషుల ఆధిక్యత సాగినన్నాళ్ళు సాగింది. స్త్రీలే తమకు జరిగిన నష్టాన్ని గుర్తించి, వారు తెచ్చిన కనిపించని 'విప్లవం' వలనే నశించింది. అలానే బాల్యవివాహాలు అయితే ఈ కట్నాల విషయంలో

స్త్రీజాతి దోపిడీని సరిగా గుర్తించలేదు. అందుకే దానికోసం స్త్రీలు సమరం సాగించలేదు."

"అదే కాదు.... స్త్రీజాతి మేల్కొంది. పత్రికలలో చూడలేదూ – ఎందరో ఆడవాళ్ళు కట్నం తీసుకునేవాడిని నే పెళ్ళాడను అని వ్రాయటం.." చిన్నగా నవ్వాడు రవి.

"అది కీర్తి కండూతితో పత్రికలలో పేరుపడటంకోసం చేసేది. అలా వ్రాసుకున్న ఏ స్త్రీ – వరకట్న విషేధంకోసం ఈ మార్పులు జరగాలి అని సహేతుకంగా వివరించలేదు. దానివలననే అవి వట్టి మాటలని అర్థమవుతాయి.... ఆర్థిక స్వాతంత్ర్యం స్త్రీకి సమకూరనంతవరకు దానికోసం స్త్రీలు పోరాడనంతవరకు ఈ వరకట్న సమస్యలు పోవు...."

"ఆర్థికస్వాతంత్ర్యం ఉన్న రమను చేసుకోవటానికి కట్నం కావాలంటుంటేనే .... అపుడు మాత్రం ఎలా పోతాయి?" చిన్నగా చురక వేసింది జానకి, నాకేసి చిరునవ్వుతో చూస్తూ.

"ఉద్యోగం, సంపాదనా.... ఇవి ఆర్థికస్వాతంత్ర్యాన్నివ్వవు చరిత్రలో మనకు తెలిసి ఆర్థికస్వాతంత్ర్యంకోసం పోరాడిన స్త్రీలు ఎవరో నీకు తెలుసా?"

జానకి మాట్లాడలేదు. రవి నాకేసి చూశాడు. దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడిన వీరవనితలు నాకు తెలుసు గాని ఆర్థిక స్వాతంత్ర్యంకోసం పోరాడిన వనితలు నాకు తెలియదు.

కాసేపాగి తనే అన్నాడు రవి. "ఝాన్సీలక్ష్మీబాయి."

"ఆమె దేశ స్వాతంత్ర్యంకోసం కదూ పోరాడింది?"

"అవును .... కాని దానిలో దేశ స్వాతంత్ర్యంకోసం కంటే – స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యంకోసమే పోరాడింది...."

"అదెలా?"

"ఆమె స్త్రీ కనుక ఆమె తీసుకున్న దత్తు చెల్లదని బ్రిటిష్ ప్రభుత్వం వాదించింది. స్త్రీ అయినా ఆ దత్తు చెల్లుతుందని పట్టుబట్టింది ఝాన్సీ. అందుగురించే యుద్ధం మొదలైంది. తరువాత దేశ స్వాతంత్ర్య కారణమూ బ్రిటిష్‌వారిపై యుద్ధానికి కారణమైంది. అంటే స్త్రీ జనోద్ధరణకు, స్వాతంత్ర్యానికి పూనుకున్న తొలి వనిత ఝాన్సీలక్ష్మీబాయి అవుతుంది. అయితే ఆ దృక్కోణం చరిత్రలో ఎక్కువ 'ఫోకస్' అవలేదు గనుక చాలామందికి తెలియదు...."

"సర్లే – ఇవన్నీ ఎందుకు కాని.... రమని ఉదాహరణగా తీసుకొని నీ వాదం వినిపించు...." విసుగ్గా అన్నాను నేను.

కాసేపాగి తిరిగి సిగరెట్ వెలిగించుకున్నాడు రవి. జానకి ముందుకు జరిగి కూర్చుంది.

"రమ గురించి మీరు నాకు తెలుసు అనుకునే దానికంటే ఎక్కువ వివరాలే

నాకు తెలుసు.... వివరణకోసం చెబు తాను.

రమ తండ్రి శివప్రసాద్ వాళ్ళకి కలిగిన కుటుంబమే. ఏభైమిదెకరాల పొలము, ఇల్లు ఉన్నాయి. పైగా ఆయన నెలకు వెయ్యి రూపాయలదాకా సంపా దిస్తూనే ఉన్నాడు. ఇద్దరు మగపిల్లలు ముగ్గురు ఆడపిల్లలు ఆయన సంతానం. అందరికీ చదువుకోవటానికి సమానావకాశాలు ఇచ్చాడు. పెద్దవాడి చదువు కాగానే పదివేలు లంచం ఇచ్చి ఉద్యోగం వేయించాడు. ఇరవై వేల కట్నం తీసుకుని అతడికి పెళ్ళి చేశాడు. పెద్దమ్మాయికి ఇరవై వేలు కట్న మిచ్చి పెళ్ళిచేశాడు. రెండో అమ్మాయి రమకు చదువైనాక డబ్బుపెట్టి ఉద్యోగం వేయించాలి... అని కొడుకులా అనుకో లేదు. ఆ అమ్మాయి స్వయంప్రతిభతో ఉద్యోగం తెచ్చుకుంది. అయితే టీచర్‌గా స్వంతవూరే రావడానికి కొంత ప్రయ త్నం చేశాడు. రెండు వేలు షుమారుగా ఖర్చయి వుంటుంది. ఇక రెండో అబ్బాయి ఇప్పటికి డిగ్రీ నాలుగుసార్లు తప్పినా చదివిస్తూనే వున్నాడు. కావి చివరి అమ్మాయి మొదటిసారి ఫెయిల వంగానే పెళ్ళిప్రయత్నాలు చేస్తున్నాడు. కట్నం ఇచ్చి మరీ పెళ్ళిచేస్తాడు సహ జంగానే. ఆడపిల్లలకి మగవారికీ స్వంత పిల్లలయినా తండ్రి చూపించే వత్యాసము మాట పూర్తిగా అర్థమయి వుంటుంది. ఎందుకనీ? మగపిల్లలు తనను పోషిస్తారనీ ఆడపిల్లలు పోషించ రనీ.

శివప్రసాద్ 'కట్నం' అనే దానికి వ్యతిరేకి కాడు మానసికంగా, సిద్ధాంత పరంగా. కొడుకుకి దక్షిణలా తీసుకు న్నాడు గనుక అలాగే కూతురికి ఇచ్చాడు బాధ్యత గనుక. నిజానికి పెద్దమ్మాయికి ఆ స్థిలో వాటా ఇస్తే రెండెకరాల పొలం ఇవ్వాలి. అంటే నలభై వేలివ్వాలి. కానీ ఇరవై వేలే ఇచ్చి పదివేలు పెళ్ళిఖర్చులు పోయినా పదివేలు మిగుల్చుకున్నాడు. అంటే స్వంత కూతుర్నే దోపిడీచేశాడు. అయితే ఎవరూ దీనిని దోపిడీ అనరు. ఎందుకంటే మన సమాజంలో ఇది సర్వ సాధారణం గనక.

రమ ఉద్యోగం చేస్తోంది గనక కట్నం ఇవ్వక్కర్లేదంటాడు. అంటే ఆమెతే చెందాల్సిన-నలభై వేలూ పూర్తిగా దోపిడీ చేస్తాడన్నమాట. నేను పదివేలడిగితే– నాది దోపిడీ అన్నారు మీరు. నా తల్లి దండ్రులనుండి నా వాటా ఆస్తిని తీసు కొచ్చాను నేను. నా కెలా హక్కుందో ఆమెకు అలాంటి హక్కేవుండాలి కదా! నేను వుద్యోగస్తుడిని, ఆమెకూ ఉద్యోగం వుంది. నాకు ఆస్థి వుంది. ఆమెకూ వుండాలి. ఆమెకు ఆస్తిలేకుంటే, ఆమెను చేసుకోవటానికి నేను అడిగేది కట్నం అవుతుంది. ఆమెను హింసించినవాడి నవుతాను. సమాజంలో ఓ వ్యక్తిగా

ఒక నీచ సాంప్రదాయాన్ని సమర్థించే వాడినవుతాను.

కాని, ఆమె తన ఆస్తిని తన తల్లి దండ్రులు ఉంచుకున్నపుడు, ఏ ఆస్తి నేను మాత్రం ఎందుకు తీసుకోవాలి? కాని సమాజపరంగా నా ఆస్తి నేను తీసుకోక తప్పదు. ఆమె ఆస్తి ఆమె తీసుకోవటం ఆమె హక్కు.... శివ ప్రసాద్ తన ఆస్తిని ఐదు భాగాలు చేసి ఒక భాగం ఆమెకు ఇవ్వమనండి. నేను కట్నం తీసుకోకుండానే ఆమెను చేసుకుంటాను....


నిజానికి ఆమెను-ఉద్యోగం చేస్తుంది కనుక ఎవరైనా కట్నంలేకుండానే చేసుకోవచ్చు.... కాని అందువల్ల ఆమె ఆత్మాభిమానం మిగుల్తుంది అనుకుంటే అది ఆమె పొరపాటే అవుతుంది. ఉద్యోగం ఉంది. గనుక కట్నం తీసుకోలేదు .... అది కట్నానికి ఎన్ని రెట్లో! కాని ఇండైరెక్టుగా కట్నం ఇచ్చినట్లే లెక్క. అలాకాక అతనే ఉద్యోగం లేని చిన్న కూతుర్ని కట్నంలేకుండా చేసుకుంటే— అపుడా అమ్మాయికి ఆత్మాభిమానం మిగుల్తుంది కాని రెండు సందర్భాలలో వారి వాటకు ఆస్తి తండ్రిచే దోచుకోబడుతుంది.... ఇప్పుడు చెప్పండి ....? నేను కట్నం అడగటం సబబు కాదంటారా? కట్నం లేకుండా పెళ్ళిచేసుకున్నానని సంఘంలో తలెత్తుకు తిరుగగలను. కాని ఆ దోపిడీని నేను మర్చిపోలేను.... అన్నీ తెలిసినా కూడా దీని ప్రోత్సహించలేను..."

"రమకూడా కట్నం తీసుకునేవారిని పెళ్ళిచేసికోదు...." ఉడుగ్గా అంది జానకి. "నిజమే.... అది మంచిదే.... అలాంటి చొరవ స్త్రీలలో రావాల్సిందే. కాని అది ఆస్తిపాస్తులు లేనివారి విషయంలో. అక్కడ వాము దోపిడీకి గురవరు. అలాటిదే నేనూ ప్రోత్సహిస్తాను. కాని రమలాంటి కేసుల్లో, కట్నంగా కానున్నా తమ ఆస్థిని తాము తమ వెంట తీసుకరావటమే నిజమైన మార్పు అవుతుంది...."

"అంటే స్త్రీలకు ఆస్తి హక్కు ఇస్తే కట్నాలు పోతాయంటావా?"

"పోవు.ఎందుకంటే-పితృస్వామ్యంలో స్త్రీ అనేక రకాలుగా సాలెగూడులో బంధింపబడివుంది. అది తెంచుకోవటానికి చాలా సమయం పడుతుంది...ఎంతో చైతన్యం రావాల్సి ఉంటుంది.... ఆ చైతన్యానికి ఆస్తి హక్కు అలందన మాత్రమే.... నిజమైన మార్పు స్త్రీలలో రావాలి. వారు దోపిడీని సరిగా అర్థం చేసుకుని మరో ఝాన్సీలక్ష్మీబాయిలా తిరుగబడితే గాని ఈ దురచారం నాశనమవదు.... ఆలోచించండి.... సమస్యను లోతుగా పరిశీలిస్తేగాని కారణం అర్థమవదు.... కారణం దొరికితేగాని చిక్కుముడి విడటం ప్రారంభించదు....

ఇతను శ్రీనివాసని నా ఫ్రెండేలెండి!
పాపం ఈ మధ్యనే పెళ్ళిచేసుకున్నాడు!?



జానకి లేచింది ప్రక్కలు వేయటానికి.

"సరేరా.... ఇవన్నీ తరువాత ఆలోచిద్దాం గాని.... ఒక్కమాట అడుగుతాను సూటిగా జవాబు చెబ్తావా!" అడిగాను.

"అడగరా!" నవ్వేడు రవి.

"రమ నీకు అన్ని రకలుగా నచ్చింది గదా!

తలపూపాడు రవి.

"రమ దోపిడీకి గురయితే నీకేం.... నీకు ఎన్నో రెట్లు లాభముంటుంది కదా! పెళ్ళికెందుకు ఒప్పుకోవు!"

"రమలో ఆవేశం తప్ప ఆలోచన లేదు. భావచైతన్యం అసలేలేదు. భావచైతన్యాన్ని ఆర్థికపరమైన విషయాంలోనే సరిగ్గా అంచనా వేయగలం.... ఆర్థిక పరంగా సరయిన అవగాహన వుంటే, కట్నం ఇవ్వమని తండ్రిని కోరివుండేది రమ. తను దోపిడీకాకుండా చూసుకునేది. కట్నాలగురించి స్థూలంగా ఆలోచిస్తూ కట్నం తీసుకురావటమంటే తనను అవమానపరిచినట్లుగా భావిస్తోంది. కట్నం ఇవ్వకుండా తన తండ్రికి అదా చేస్తున్నాని భ్రమపడుతోంది తప్పితే తాను మోసపోతున్నానని తెలుసుకోలేక పోతుంది.... ఆమె చదువుకున్న చదువు ఉద్యోగం ఆమెకు లోకజ్ఞానాన్ని ఇవ్వలేదు.... ఐ పిటీ దట్ సార్ట్ ఆఫ్ పీపుల్ .... వారు జీవితాంతం దోచుకోబడుతూనే వుంటారు.... అంతేకాదు.... ఆమెకి సంవత్సరం రెండేళ్లలో పెండ్లి కాకపోతే.... మరి జీవితాంతం కుమారిగానే వుండిపోతుంది...." నిట్టూరుస్తూ అన్నాడు రవి.

"అదెలా!"

"ఇదీ దోపిడీయే ... అది నీ కర్థం కాదులే.... పడుకో—" చిన్నగా నవ్వేసి నా భుజంతట్టి తన ప్రక్కకేసి కదిలాడు రవి.

ఆలోచిస్తూ పడుకున్నాను నేను.

తరువాత మళ్ళీ రవిని పెళ్ళి గురించి హెచ్చరించలేదు నేను.

కొద్దిరోజులతర్వాత శివప్రసాద్‌గారు బజార్లో కనిపించి రవివిషయం అడిగారు. 'కట్నం లేందే చేసుకోడట' చెప్పేశాను నేను.

"అందుకే ఈదేశం ఇలా అయిపోతుంది.... తనకన్నా ఎక్కువ సంపాదించే అమ్మాయిని చేసుకోటానికి కట్నం కావాలట! ఇంకానయం.. పెళ్ళి కుదిరింది కాదు.... ఎటయినా మా రమ అదృష్టవంతురాలే.... అలాటివాళ్ళే కదండీ.... డబ్బుకోసం భార్యల్ని కిరసనాయిలు పోసి తగలబెట్టేది!" విసురుగా అన్నాడు. నేను మాట్లాడలేకపోయాను. అసలు విపులంగా మాట్లాడడం నాకు చేతకాదేమో అనుకుంటాను. అదీగాక రవి చెప్పింది నాకు అంత బాగా అర్థంకాలేదు కూడా.

రవితో ఆ విషయం అన్నాను.... నవ్వేశాడు రవి. మామూలుగానే నెమ్మదిగా అన్నాడు "ఐ.... పిటీ దట్ గర్ల్"

నేను ఇక ఆ విషయం పట్టించుకోలేదు. తరువాత శివప్రసాద్‌గారు మరో సంబంధం చూడమన్నా నేను పట్టించుకోలేదు.

తరువాత రెండేళ్ళకి రవికి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయాడు. పెళ్ళి కూడా జరిగింది. అయితే వ్యవసాయపనులతో తీరికలేక నేను వెళ్ళలేకపోయాను.

• • •

పదేళ్ళ తరువాత ఒకరోజు మధ్యాహ్నం పొలంనుండి ఇంటికి వస్తున్నాను. దారిలో శివప్రసాద్‌గారు కలిశారు.

ఇద్దరం మాట్లాడుకుంటూ మా ఇంటికేసి వచ్చాం. ఇంటి ముందు చిన్నకారు ఆగివుంది.

"ఎవరో చుట్టాలొచ్చినట్లున్నారే!" అడిగాడు శివప్రసాద్ గారు, తలపంకిస్తూ. లోపికొచ్చాను నేను. కుతూహలం కొద్దీ కాబోలు ఆయన నాతో లోపలికి వచ్చాడు.

ముందుగదిలో జానకి ఎవరో స్త్రీతో మాట్లాడుతోంది. ప్రక్కనే ఇద్దరు పిల్లలున్నారు. మమ్మల్ని చూడగానే లేచి నిలబడ్డారు వారు.

"మన రవి భార్య అండీ.... నిర్మల.." పరిచయంచేసింది జానకి.

"నమస్తే...." చేతులు జోడించింది నిర్మల. నేను అప్రయత్నంగా చేతులు జోడించాను.

"అదేనండీ.... రవిలేడూ-మనింట్లో ఉన్నాడు. మీ క్లాస్‌మేట్ .... ఈవూరి బ్యాంక్‌లో పనిచేశాడు .... రచయిత" గుర్తుచేసింది శ్రీమతి నా మతిమరుపు అనుభవం కాబట్టి. నాకు లెటర్స్ రాసే అలవాటు తక్కువ, వాడికీ అంతే.... అందువల్ల వాడి గురించి నాకు వెంటనే స్ఫురణకు రాదు అనుకొని శ్రీమతి గుర్తుచేసింది. కాని ఆమెకేం తెలుసు— ఉత్తరాలు వ్రాసుకోకున్నా, పరస్పరం కలుసు

కోరుకున్న మా స్నేహలత పెరుగుతూనే వుందనీ– అదే స్నేహానికి అర్థమనీ!

"ఏదా!? ఎప్పుడొచ్చాడు...." ఆనందంగా అన్నాను.

"మీరలా పొలం వెళ్ళగానే వచ్చాడు. ఇపుడు డివిజనల్ మానేజరయ్యాట్ట. ఈ వూరు క్యాంప్ వేసుకుని భార్యను కూడా తీసుకొచ్చాడు...."

"కూర్చోమ్మా...." అంటూ నిర్మలతో చెప్పి కూర్చోమని శివప్రసాద్‌కి సైగ చేశాను.

"ఎవరూ!" కళ్ళజోడు సర్దుకుంటూ అడిగాడు శివప్రసాద్‌గారు.

"ఇదేనండి.... పదేళ్ళ క్రితం మన వూరి బ్యాంక్‌లో పనిచేయలా 'రవి' అని మా ఇంట్లోనే వుండేవాడు ... నా క్లాస్ మేట్...."

"ఓహో! అతనా!" కుర్చీలో కూర్చుంటూ అన్నాడు శివప్రసాద్‌గారు ఆయన భృకుటి ముడిపడింది.

"ఏమ్మా నిన్ను బాగానే చూసుకుంటాడా?" ఆత్రుతగా అడిగాడు శివప్రసాద్‌గారు

చిరునవ్వు నవ్వింది నిర్మల.

"కట్నం ఎంతిచ్చారేమిటి?" ఆత్రుతగా అడిగాడు శివప్రసాద్. నాకు కొంచెం చిరాకనిపించింది.

"అబ్బే ... ఏమీలేదండీ.... నన్ను చూడటానికి వచ్చేముందరే కట్నం తీసుకోనని కబురుపెట్టారు–" నమ్రతగా అంది నిర్మల.

"ఆహా.... అలాగా!" తల పంకించారు ఆయన. "నీవుగాని వుద్యోగం చేస్తున్నావమ్మా....?"

"లేదండీ...." తలూపింది నిర్మల. అంతలో జానకి అసహనంగా లేచి లోపలికి పోవటంతో, అనుసరించింది నిర్మల.

"ఏమిటో ఈ కుర్రాళ్ళ బుద్ధులు మాకర్థం కావోయ్...." నాకేసి చూస్తూ అన్నాడు.

"మా అమ్మాయి నిస్తానన్నాగా! అమ్మాయి లక్షణంగా వుంటుంది .... ఉద్యోగం చేస్తున్నదనీ... అయితే కట్నం అడిగాడు కదా! అమ్మాయి కూడా అంత రూపసి కాదే–" తన కూతురుతో నిర్మలను పోలుస్తూ అన్నాడు శివప్రసాద్‌గారు. నాకెందుకో ఆ సంభాషణ అసహజంగా అనిపించి మాట మార్చి పొలాల గురించి మాట్లాడటం మొదలుపెట్టాను.

ఐదు నిముషాలలో లేచి వెళ్ళిపోయాడాయన. తృప్తిగా నిట్టూర్చి లోనికి నడిచాను నేను.

• • •

భోజనం చేసేప్పుడు నిర్మల శివప్రసాద్ గురించి చెప్పింది.

"ఏమిటో – మీరు కట్నం లేకుండా నన్ను చేసుకున్నారంటే నమ్మలేదాయన–" అని నవ్వేసి ముగించింది.

"ఎవరాయన!" నవ్వుతూనే నాకేసి చూశాడు.

"ఆయన కాదు నేనూ నమ్మలేక పోయాను.." జానకి అంది కల్పించుకుని.

"అదే- రమ తండ్రి.... శివప్రసాద్ గారు...." అన్నాను నేను.

"ఏ రమ?" ఆత్రుతగా అడిగింది నిర్మల.

"ఇక్కడ టీచర్‌గా చేస్తుండేది.... నిన్ను పెళ్ళిచేసుకోమని అడిగాను గుర్తుందా? నీవు కట్నం అడిగావు...." రవికేసి తిరిగి అన్నాను.

గుర్తొచ్చినట్లుగా తలూపాడు రవి.

"ఆయన-ఉద్యోగంచేసే అమ్మాయిని చేసుకోవటానికి కట్నం అడిగారా? నే చస్తే నమ్మను." గట్టిగా అంది నిర్మల.

"కాదు - నిజమే" నవ్వుతూనే అన్నాడు రవి. కళ్ళు విప్పార్చింది నిర్మల ఆశ్చర్యంతో.

"ఎందుకని? అది మీ సిద్ధాంతానికి వ్యతిరేకం కదా!"

"అది మాత్రం అడక్కు తల్లీ నీకు పుణ్యం వుంటుంది. మళ్ళీ క్లాస్ తీసుకుంటాడు—" నవ్వుతూనే అంది జానకి.

"ఆ అమ్మాయి కింకా పెళ్ళి కాలేదు కదూ?" ఏదో ఆలోచిస్తున్నట్లుగా అన్నాడు రవి.

"అరె! నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది జానకి.

"అదంతే జానకీ!" తాపీగా అన్నాడు. "ఇలాటి కథలకి ముగింపు ఒకటే." చిన్నగా నిట్టూర్చాడు. "ఉద్యోగాలు.... కొత్త జీవనం వీటికి మన స్త్రీలు పూర్తిగా అలవాటు పడలేదు. ఉద్యోగం రాగానే స్వంత 'ఐడెంటిటీని' వృద్ధిపరుచుకు టారు స్త్రీలు. అది మంచిదేగాని దానికి 'అహం' జోడై విపరీతంగా ఆలోచిస్తుంటారు. ఉద్యోగం ఉంది.... కట్నం లేకుండా చేసుకోరా అని అనుకుంటారు. కట్నం ఇవ్వటం తమని అవమానించటంలా అనుకుంటారు. సహజంగా పట్నాలలో వుండేవారికి త్వరగా సంబంధాలు దొరుకుతాయి. తాము కట్నం తీసుకుపోకుండా పెళ్ళిచేసుకున్నామని గర్వపడతారేతప్ప, తాము దోపిడీ కాబడ్డామని గుర్తించకుండా బ్రతికేస్తారు. ఇంకొందరు తమకంటే గొప్పవాడు రావాలని ఆలోచిస్తూ ఎదురుచూస్తూ గడిపేస్తారు. కొందరు భర్తొకచోట, తామొకచోట, పిల్లలొకచోట వుంటూ దబ్బుకోసం చాలా సుఖాలు వదులుకుంటారు. కాని, పల్లెలలో వుద్యోగాలు చేసేవారికే సమస్య లెక్కువ. సాధారణంగా పల్లెలలోనే వుద్యోగాలు చేసే వరుడు దొరకటం కష్టం. వేరేచోట వుద్యోగం చేసే అతన్ని చేసుకుని వెళ్ళిపోవటానికి, తన ఉద్యోగం వదులుకోవటానికి స్త్రీ అంగీకరించదు - అందులోను గవర్నమెంట్ జాబ్ అయితే అసలు ఒప్పుకోదు. తన ఉద్యోగంలోనే తన కంటే పైవాడు కావాలని కలలుకంటుంది కొంతకాలం.... తరువాత తన స్థాయి

వాడైనా చాలనుకుంటుంది. కాని దొరకటం దుర్లభం.... వయసు పెరిగేకొద్దీ వరులు దొరకటం కష్టమవుతుంది.... తరువాత జీవితంతో రాజీపడి కట్నం ఇద్దామను కుంటుంది. కానీ వరులు లభించరు... దొరికినా అది అమె సంపాదనకోసమేనని పూర్తిగా అమె తెలుసుకుంటుంది...అంటే రాజీతోపాటు జీవితంలో నటించటం కూడా నేర్చుకోవాలన్నమాట.... ఉద్యోగం చేసే ఆడవాళ్ళు నలుగురు మొగ వాళ్ళతో మాట్లాడాల్సి వుంటుంది. దానికి వికృతరూపం ఇచ్చేవాళ్లు కోకొల్లలు. దాంతో మనసు చివుకుతుంది. తరువాత పెళ్ళి కావటమూ కష్టమవుతుంది....చాలా మంది యాంత్రికంగా బతికేయటమో, ఎవరో ఒకర్ని కట్టుకోవటమో, ధైర్యం లేనివారు కుమారిగానే మిగిలిపోవటమో జరుగుతుంది.... రమ ధైర్యం లేనిది కనుక కుమారిగానే మిగిలిపోతుంది.... అనుకున్నాను...."

నేను మాట్లాడలేదు.

జానకి మాట్లాడలేదు.

"అయితే ఆడవాళ్ళు ఉద్యోగం చేయ కూడదంటారా?" అడిగింది నిర్మల.

"అనను.... తప్పకుండా చేయాలి. కాని లోకజ్ఞానం మర్చిపోకూడదు.... తనని ప్రేమించేవాళ్ళే తన శత్రువులవు తారని, తన ఉద్యోగమే తనకి పెళ్ళి కాకుండా అడ్డుపడుతుందని-గుర్తించాలి."

"రమకి శత్రువు లెవరు?" ఆసక్తిగా అడిగింది జానకి.

"ఆమె తల్లిదండ్రులు. ముఖ్యంగా తండ్రి. బంగారు గుడ్లుపెట్టే బాతుని వదులుకోవాలని ఏ పగవాడూ అను కోడు."

"అదేం? ఆయనకి సంపాదనుందిగా? కూతురి పెళ్ళికోసం తెగ ఆరాటపడటం నే కళ్ళారా చూశాను .."

"ధనాపేక్షకు అంతం లేదు ఆయన కూతురు పెళ్ళిచేయదల్చలేదనీ ఎవరూ అనుకోరు. కనిపించిన ప్రతివాడినల్లా కూతురికి ఒక సంబంధం చూడమని అడుగుతూనే వుంటాడు.... కాని దొరికిన సంబంధాన్ని కుదరనివ్వడు.... ఆయన మనోభిప్రాయాన్ని ఎవరూ గుర్తించ కుండా జాగ్రత్త పడుతుంటాడు.... పిచ్చి లోకం.... అదే నిజమనుకుంటుంది...." చెప్పాడు రవి. "శంకరికి కూతురు కూడా నమ్ముతుంది."

"శివప్రసాద్ కూతురు పెళ్ళిచేయదని నీవెలా కనుక్కున్నావ్.." ఆశ్చర్యంగా అడిగాడు, పదేళ్ళు గడిచాక ఇప్పుడు లోకమూ అలానే అనుకుంటున్న మాట వాస్తవమే. రమకి ఈ సంగతి తెలిసి పోయింది. కాని గతజల సేతుబంధనం వలన వుపయోగం ఏమిటి?

"నేను కట్నం అడగంగానే తిరస్క రించగానే అనుకున్నాను. నిజానికి ఆమె ఉద్యోగంలో చేరి సంవత్సరం అయింది. ఆమె సంపాదన అయినా కట్నంగా ఇవ్వ

వచ్చు. కానీ ఇష్టపడలేదంటే? డబ్బు మీద ఆశపడుతున్నాడన్నమాట. కట్నం తీసుకోకూడదనే ఆశయం నాకుందని నేను చెప్పినా ఆ సమయంలో మీరు నమ్మరనీ తెలుసు. అందుకే కట్నం అడిగాను. దానితో రమ వ్యక్తిత్వమూ, శివప్రసాద్ మనస్తత్వమూ తెలిసిపోయాయి.

తరువాత నిర్మలని చూశాను. వాళ్ళ వాళ్ళు బీదవాళ్లు. నిజంగా కట్నం ఇవ్వలేకపోవటంవల్లనే ఆమె పెళ్ళి ఆగిపోతూ వచ్చింది. అది గమనించిన నేను కట్నం లేకుండా వివాహం చేసుకున్నాను. నా ఆశయానికి దీనివలన రూపం వచ్చింది. అదే రమను చేసుకునివుంటే నేను కట్నం తీసుకున్నవాళ్ళకంటే స్వార్థపరుడ్నయి వుండేవాడిని...."

"అయితే ఈ కట్నాల బెడద ఎలా పోతుందంటావు?" తాపీగా అడిగింది జానకి.

"మీకు ఇంతకుముందే చెప్పాను. ప్రతి సమస్యకు మూలం కనుక్కోవాలని. రమ విషయమే తీసుకోండి. ఆమె వాటాకు వచ్చే ఆస్తికంటే తక్కువ కట్నం ఇచ్చినా, ఉద్యోగం ఉంది గనుక కట్నం లేకుండా చేసుకున్నా ఆమె దోపిడికి గురయేది. అలానే ఇప్పుడు పెళ్ళికాక దోపిడీకి గురవుతుంది దోపిడీ చేయబడిన ఆస్తి, కష్టార్జితం అంతా ఎక్కడికి చేరుతుందో- అక్కడ అసలు కట్నాలనే సమస్య పుట్టుకొస్తుంది. ఆ సొమ్ము మగపిల్లలకేకాక ఆడపిల్లలకి చెందే సమయం వచ్చినపుడు గాని ఈ వరకట్న పిశాచం పారిపోదు."

"అది వస్తుందంటావా?" ఆశగా అంది నిర్మల. పెళ్ళికాక ఇంట్లో వున్న ఇద్దరు చెల్లెళ్ళు గుర్తుకొచ్చారామెకు.

"వస్తుంది. కాని మగవాడు ఇవ్వడు. స్త్రీజాతి జాగృతమయి తనకు తానుగా తీసుకున్ననాడు.... తప్పక వస్తుంది...."

జానకి అయోమయంగా నాకేసి చూసింది. నాకు తెలుసు జానకికి అర్థం కాలేదని. 'మా పెద్దవాడికి ఎంత కట్నం వస్తుందా?' అని ఆలోచించే జానకికి అది అర్థమూకాదు. నా కర్థమయినా, నా కది అవసరం లేదు. ఎందుకంటే నాకు ఇద్దరూ మగపిల్లలే...."

